క్లుప్తంగా...

యోగాతో ఆరోగ్యం.. ఆనందం



యోగా దినోత్సవంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

రామంతపూర్: ప్రభుత్వ పాలిటెక్నిట్ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉరుకులు పరుగుల పోటీ ప్రపంచంలో మానసిక శారీరక రుగ్మతలను రూపుమాపేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. అందరూ ఆరోగ్యంగా జీవించాలంటే నిత్యజీవితంలో యోగాసనాలు చేయాలని సూచించారు. యోగా గురువు సత్యారెడ్డి, పతంజలి యోగా సెంటర్ చైర్మన్ రామనాథం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు మురళీధర్‌రావు, కార్పొరేటర్లు కక్కిరేణి చేతన హరీష్, బండారు శ్రీవాణి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అలసత్వం వీడాలి

అల్వాల్: కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరులో అధికారులు అలసత్వం వీడాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అల్వాల్ తహసీల్దార్ కార్యాలయ వద్ద బీజేపీ తరఫున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు క్రిష్టారెడ్డి, దండుగుల వెంకటేష్, మల్లికార్జున్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాల అభివృద్ధికి బీసీ రుణాల మంజూరు కోసం స్థానిక తహసీల్దార్ నుంచి కులం, ఆదాయ పత్రాలు అవసరమన్నారు. కానీ దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మండల అధికారులు అలసత్వం వహిస్తున్నారన్నారు. అల్వాల్, మచ్చబొల్లారం, వెంకటాపురం, కౌకూర్ ప్రాంతాల్లోని లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నా సిబ్బంది కొరత, సర్వర్ డౌన్‌తో పెండింగ్‌లో పెడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని మండల తహసీల్దార్ నాగమణికి వినతి పత్రం అందజేశారు. నాయకులు మహేందర్‌రెడ్డి, కార్తీక్‌గౌడ్, గోపి, మల్లికార్జున్ యాదవ్, తాళ్ల వినయ్, మహేష్‌యాదవ్, అజయ్‌రెడ్డి, మహిళా నాయకులు కరుణశ్రీ, ఈగ లావణ్య, సుజాతా, అరవింద్‌రెడ్డి, లక్ష్మణ్, అనీల్, చారి, నాగరాజు, రాంసింగ్, నాగి, ఆనంద్, గణేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో పార్కుల అభివృద్ధి



భగత్‌సింగ్‌నగర్ పార్కులో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్

అల్వాల్: ప్రజలకు ఆహ్లాదం అందించడానికి పార్కులు దోహదపడతాయని కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్ అన్నారు. మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్, న్యూవిద్యానగర్, ఎల్‌బీనగర్‌లలో రూ.40 లక్షలతో అభివృద్ధి చేసిన పార్కులను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం పార్కుల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ హార్టికల్చర్ అధికారులు మహేశ్వరి, వెంకటేష్, రమేష్, దీపక్, బీజేపీ నాయకులు సంతోష్, మురళి, నందుయాదవ్, సునీల్ యాదవ్, శ్రీకాంత్, కాలనీ వాసులు శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఫ్లెక్సీలను తొలగించాలి



ఫ్లెక్సీలను తొలగించాలని డీసీకి వినతి పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఉప్పల్: బీఆర్ఎస్ నేతలు దశాబ్ది ఉత్సవాల పేరుతో పర్యావరణానికి విఘాతం కలిగించే విధంగా పార్టీల ఫ్లెక్సీలను ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేయడంపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పల్ సర్కిల్ అధికారులు అధికార పార్టీ నాయకులకు ఒక న్యాయం, ఇతర పార్టీలకు ఇంకో న్యాయంగా వ్యవహరించడంపై డీసీ అరుణకుమారిని నిలదీశారు. ఈ మేరకు సోమవారం సర్కిల్ కార్యాలయంలో డీసీని కలిసి తమ డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే ఫ్లెక్సీలను తీసివేయాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

భవిష్యత్ తరాలకు పచ్చ‘ధనం’

మంత్రి చామకూర మల్లారెడ్డి



పీర్జాదిగూడ జరాయువు పార్కులో మొక్కలు నాటుతున్న మంత్రి మల్లారెడ్డి, మేయర్ జక్కా వెంకట్ రెడ్డి



హరితహారంలో మొక్కలు నాటుతున్న బోడుప్పల్ మేయర్ బుచ్చిరెడ్డి

మేడిపల్లి: తెలంగాణ హరితోత్సవంలో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరాయువు పార్కులో సుమారు 5000 మొక్కలను నాటే కార్యక్రమంలో మంత్రి చామకూర మల్లారెడ్డి, మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కమిషనర్ వంశీకృష్ణ పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సుమారు మూడు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు ఇవ్వాల్సింది ఆస్తులు కాదు.. మనం మంచి వాతావరణాన్ని ఇవ్వాలని మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రంలో పచ్చదనం పెరిగిందన్నారు. మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వచ్ఛమైన గాలి, నివాస యోగ్యమైన ప్రకృతే ప్రధానమని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ప్రకృతి పరిసరాలను అందించాలనే గొప్ప సంకల్పమే హరితహారానికి పునాది అని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, మున్సిపల్ అధికారులు, ఫారెస్ట్ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష మొక్కలు లక్ష్యం..

ఉప్పల్: డివిజన్‌లో లక్ష మొక్కలు లక్ష్యంగా నాటుతామని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలో రేంజ్ ఫారెస్ట్ అధికారితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జోషి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగిద్దాం

బోడుప్పల్: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు నడుం బిగిద్దామని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన హరితోత్సవం, 9వ విడత హరిత హారం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెజాన్ అడవులను తలపించే స్థాయిలో పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం చెంగిచర్లలో రూ.11 లక్షల వ్యయంతో తాగు నీటి పైపులైన్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, పులకండ్ల హేమలతారెడ్డి, సుమన్ నాయక్, మహేశ్వరి, కొత్త దుర్గమ్మ, మేనేజర్ మంజులత, డీజీఎం నిర్మల పాల్గొన్నారు.

భవిష్యత్ తరానికి పచ్చదనం..

అల్వాల్/గౌతంనగర్: ఆరోగ్యం, పర్యావరణం, భవిష్యత్ తరానికి పచ్చదనాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మచ్చబొల్లారం డివిజన్‌లోని వెంకూస్ కాలనీలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్కును ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజ్‌జితేంద్రనాథ్, శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబితకిషోర్, ఉపకమిషనర్ నాగమణి, ఉద్యానవన శాఖ అధికారిని ప్రవీణ, డీఈ మహేష్, కాలనీవాసులు రామనాథం, శ్రీధర్, విజయకుమార్, ఉమాపతి, మోహన్‌కృష్ణ, స్థానిక నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, పరమేష్, శోభన్, వివిరావు, కవిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం కౌకూర్‌లో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబితకిషోర్, జితేంద్రనాథ్‌లు, డీసీ నాగమణి హరితహారంలో పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో హరితహారం

రామంతాపూర్: పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో సోమవారం ఎపిరాక్ ఇంజినీరింగ్ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం 16 మంది డిప్లొమా విద్యార్థులకు రూ.4 లక్షల స్కాలర్‌షిప్స్ అందజేశారు. సంస్థ మేనేజర్ అవనీష్, ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.



చిలుకానగర్‌లో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ బన్నాల గీత, ఫారెస్ట్ రేంజ్ అధికారి తదితరులు



మచ్చబొల్లారంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్లు



గౌతంనగర్ డివిజన్ సాయినగర్‌లో కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్



కుషాయిగూడ: హెచ్‌బీకాలనీలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ ప్రభుదాస్



కాప్రాలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్



రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో..

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథం ప్రారంభం

ఉప్పల్: ఉప్పల్ హెచ్ఎండీఏలో మొక్కలు నాటేందుకు వచ్చిన రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేతులమీదుగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల బిల్లులను తక్షణమే చెల్లించాలి

కాప్రా: జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టర్ల బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరుతూ సోమవారం కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రసాగర్ ఆధ్వర్యంలో వీ వాంట్ పేమెంట్ అంటూ నినాదాలు చేస్తూ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ల అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేద రెడ్ల హక్కుల సాధన కోసం పోరాడాలి



ఉప్పల్ డిపో చెన్నారెడ్డి ఎన్‌క్లేవ్‌లో సమావేశం

మేడిపల్లి: ఉప్పల్‌లో రెడ్డి ఐక్యకార్యాచరణ రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి, రాష్ట్ర కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో చెన్నారెడ్డి ఎన్‌క్లేవ్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని రెడ్డి సంఘాల నిర్మాణం గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జరగాలని, రాష్ట్రంలో ఒకే రెడ్డి సంఘంగా ఏర్పడి పేద రెడ్ల హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 30వ తేదీన హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించాలని కమిటీ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు చెప్పారు. సంజీవరెడ్డి, గోపాల్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, నర్సింహరెడ్డి, కాంతాల నారాయణరెడ్డి, మధుకర్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

మల్కాజిగిరి: రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. వెంకటేష్‌యాదవ్, జీవన్‌రెడ్డి, గుత్తి చందు, వినోద్‌యాదవ్, సానాది శంకర్, ఉమేష్‌సింగ్, సంతోష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడా పోటీలు

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

అల్వాల్: క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆటల పోటీలు దోహదపడతాయని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. టీం సాయి స్పోర్ట్స్ ఉత్సవంలో భాగంగా రెండు రోజులుగా అల్వాల్‌లో నిర్వహించిన బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. పోటీలలో ఫైనల్‌లో పవర్ రేంజర్ సంతోష్ వారియర్‌పై గెలిచి కప్పును కైవసం చేసుకున్నారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు కప్పును అందజేశారు. అనంతరం రఘునందన్‌రావు మాట్లాడుతూ యువత ప్రతిరోజూ కొంత సమయాన్ని క్రీడా రంగానికి కేటాయించి క్రీడా స్ఫూర్తిని బయటకు తేవాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు టీం సాయిప్రసాద్‌తోపాటు కార్పొరేటర్లు రాజ్యలక్ష్మీ, శ్రవణ్‌కుమార్, వీకే.మహేష్, నర్సింహగౌడ్, రవికిరణ్, అజిత్, సాయి, వాసంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



అల్వాల్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టు ఎంప్లాయిస్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడు కే.వేణుగోపాల్, అసోసియేట్ అధ్యక్షుడు బి.క్రిష్ణమోహన్, ప్రధాన కార్యదర్శిగా ఐ.శ్రీకాంత్, కోశాధికారిగా బి.వెంకటేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా బి.మహేష్, జి.నరేందర్, జి.శోభారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా సి.ప్రవీణ్‌గౌడ్, జి.రాజశేఖర్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ ప్రతినిధులు జిల్లా జడ్జి బీఆర్.మధుసూదన్‌ను కలిశారు. నూతన కమిటీని జిల్లా జడ్జి అభినందించారు.

రికార్డు స్థాయిలో పనులు పూర్తి చేశాం



రామంతాపూర్‌లో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని లక్ష్మీకాంతనగర్, రామశంకర్‌లలో రూ.45 లక్షలతో చేపట్టే కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావుతో కలిసి ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు తావులేకుండా అభివృద్ధే ఎజెండాగా అన్ని ప్రాంతాల్లో రికార్డ్ స్థాయిలో పనులు పూర్తి చేశామన్నారు. కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ.. డివిజన్‌లో ఇప్పటి వరకు 75 శాతం అభివృద్ధి పనులు పూర్తయినట్లు చెప్పారు. పెండింగ్ పనులు త్వరలో చేపడతామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ నాగేందర్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

లయోల అకాడమీలో అంతర్జాతీయ సదస్సు



లయోల అకాడమిలో జరిగిన సదస్సులో వక్తలు

అల్వాల్: అల్వాల్ లయోలా అకాడమిలో వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక రంగం పురోగతిపై మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు జరగనుంది. విద్యార్థులతో పాటు పలువురు శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునాతన పరిణామాలపై చర్చించారు. దేశంలో వ్యవసాయ రంగం ప్రధాన రంగం అయినందున పలు మార్పులు జరగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి ఐఏఎస్ రఘునందన్‌రావు, డాక్టర్ నీరజప్రభాకర్, పద్మశ్రీ చింతల వెంకట్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ జోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ప్యాడ్స్ పంపిణీ



అల్వాల్: మచ్చబొల్లారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు బీజేపీ నాయకుడు, ఓపెన్ ఛారిటీ అధ్యక్షుడు గోపు రమణారెడ్డి శానిటరీ న్యాప్‌కిన్లను పంపిణీ చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పుడమిపై కేసీఆర్ ఆకుపచ్చ సంతకం

ఎంపీ జోగినిపల్లి సంతోష్



మొక్కలు నాటుతున్న జోగినిపల్లి సంతోష్‌కుమార్, బేతి సుభాష్ రెడ్డి తదితరులు

ఉప్పల్: పుడమిపై సీఎం కేసీఆర్ ఆకుపచ్చ సంతకం చేశారని రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లేఅవుట్‌లో స్థానిక ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన హరిత దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో వన మహోద్యమాల ద్వారా ప్రకృతి పరవశించేలా లక్షలాది మొక్కలు నాటి సంరక్షించామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పంకజ, ఉప్పల్ సర్కిల్ డీసీ అరుణకుమారి, కాప్రా డీసీ శంకర్, ఈఈలు నాగేందర్, హరిలాల్, ఉప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోవిందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్

మల్లాపూర్: నాచారం బాబానగర్ సంస్కృతి హిల్స్‌లో రూ.14 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్‌కు, అధికారులకు సూచించారు. అవసరమైన చోట సీసీ రోడ్డు పనులను పూర్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, స్థానిక నేతలు కట్ట బుచ్చన్నగౌడ్, సుగుణాకర్‌రావు, సంతోష్‌గౌడ్, శ్రీనివాస్, మురళి, కామేశ్వరి, బాలమణి, శేఖర్‌రెడ్డి, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

హరితహారంలో భాగంగా నాచారం సీడీఎస్ భవన్‌లో ఆవరణలో కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ మొక్కలను నాటారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో హార్టికల్చరల్ ఏఈ శ్రీనివాస్, జవాన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఉత్తంనగర్‌లోని పార్కులో మొక్కలు నాటుతున్న బోనగిరి సురేష్‌యాదవ్

గౌతంనగర్: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని క్లీన్ అండ్ గ్రీన్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్, కాంగ్రెస్ నేత బోనగిరి సురేష్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో భాగంగా ఉత్తంనగర్‌లోని కల్నల్ సంతోష్‌బాబు పార్కు వద్ద సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు పండ్లు పంపిణీ చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో క్లీన్ అండ్ గ్రీన్ ఫౌండేషన్ ప్రతినిధులతో పాటు మాజీ ఆర్మీ ఉద్యోగి వెంకటేష్ యాదవ్, రమేష్‌బాబు, ప్రేమ్, సురేందర్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, కరుణాకర్, యాదగిరి, రవీందర్‌రెడ్డి, సుదర్శన్, లక్ష్మణ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి బంధువుల హంగామా

మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ వద్ద ఓ నిందితుడి బంధువులు హంగామా చేశారు. గౌతంనగర్‌కు చెందిన వరుణ్‌తేజ్‌పై పోక్సో కేసు నమోదైంది. పలుమార్లు లైంగికదాడికి పాల్పడమే కాకుండా ఆమె నగ్న వీడియోలు తీసి బాలికను బెదిరించి ఆమె ఇంట్లోని బంగారాన్ని కాజేశాడు. సోమవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ చేసిన సందర్భంలో నిందితుడి తల్లితో పాటు సోదరుడు హంగామా సృష్టించి పోలీసు సిబ్బంది వాహనాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నించారు. వారికి వారే గాయాలు చేసుకొని పోలీసులు దాడి చేసినట్లుగా తప్పుడు ఆరోపణలు చేయడంతో వారిపై సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు నమోదు చేశారు.